క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చినగంజాం: రాజ్యాంగ అవతరణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం ఎం దేవదత్తం తెలిపారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కే నాగరాజు, డీ నారాయణ రెడ్డి, ఏ సుబ్బరాజు, ఎస్ శ్రీరమణలు బహుమతులు అందజేశారు. సీఎంసీ చైర్మన్ ఏ సుదర్శన రెడ్డి బహుమతులు అందజేశారు.

సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

మేదరమెట్ల: క్షేత్రస్థాయి పర్యటన విద్యార్థులకు ఉపయోగపడుతుందని ఏఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మేదరమెట్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. విద్యుత్ ఫీడర్లు పనిచేసే విధానం గురించి ఏఈ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి, ప్రదీప్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

చీరాల అర్బన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న పవని భానుచంద్రమూర్తికి పట్టణంలోని శ్రీరాఘవేంద్ర హైస్కూల్‌లో మంగళవారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హైస్కూల్ డైరెక్టర్ గవిని మణికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, ఆవృత్తిలో రాణిస్తూ ఎంతో మంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం భానుచంద్రమూర్తిని ఘనంగా సన్మానించారు. అలానే పర్యావరణ పరిరక్షణ కోసం క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు ప్రవచనాలు అనుసరణీయం



సువార్త స్వస్థత సభలకు హాజరైన క్రైస్తవులు

చీరాల రూరల్: క్రీస్తు ప్రవచనాలు ప్రపంచ మానవాళికి ఆదర్శమని హోసన్నా మినిస్ట్రీస్ ప్రతినిధులు పాస్టర్ జాన్‌వెస్లీ పేర్కొన్నారు. స్థానిక జయంతిపేట సెయింట్ స్కూలు సమీపంలోని హోసన్న గ్రౌండ్‌లో గుంటూరు హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హోసన్నా సువార్త స్వస్థత సభలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ రాజులు దేవుని వాక్య సందేశాలు అందించారు. కార్యక్రమంలో హోసన్న ప్రార్థనా మందిరం ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వేటపాలెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. రామన్నపేట పంచాయతీ రావూరిపేట సమైఖ్యనగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గోవిందుల శ్రీకాంత్ వద్ద నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

జూదరుల అరెస్టు.

చల్లారెడ్డిపాలెం పంచాయతీ చేనేతపురి కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 700 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

మహోన్నతమైనది మన రాజ్యాంగం

- వేడుకగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం
- ప్రతిజ్ఞ చేసిన చిన్నారులు
- అంబేడ్కర్‌కు నివాళులర్పించిన వెంకటేష్, హనిమిరెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కరణం వెంకటేష్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పానెం చిన హనిమిరెడ్డి

చీరాల/చీరాల టౌన్/చీరాల రూరల్/చీరాల అర్బన్/వేటపాలెం: మహోన్నతమైనది మన భారత రాజ్యాంగం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును పురస్కరించుకుని రాజ్యాంగం దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. పీడిత జాతులు, అణగారిన, బడుగు, బలహీనవర్గాల సంక్షేమాభివృద్ధి కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాశారన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం మన దేశ సంపదని, దీనిని మనందరం గౌరవించుకోవాలన్నారు. రాజ్యాంగ నిర్మాతను ప్రతి ఒక్కరూ స్మరించుకుని ఆయన అడుగు జాడల్లో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండ్రు బాబ్జి, పార్టీ రూరల్ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

- మన దేశ రాజ్యాంగం ఎంతో ఉన్నతమైనదని, విలువైనదని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి అబ్బరాజు శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం చీరాలలోని కస్తూరిబా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.కృష్ణమోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.ధనమ్మ, పాఠకులు పాల్గొన్నారు.
- చీరాల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ పీవీవీఎస్ శర్మ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ ఎరిచర్ల డానియేల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.
- వేటపాలెంలోని గడియార స్తంభం సెంటర్‌లో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి దిశగా బాటలు వేసిందన్నారు. కార్యక్రమంలో నాగాంజనేయులు, తేళ్ల నాగేశ్వర్, షేక్ యూసూబ్, చొడెం శ్రీనివాసరావు, గిరీష్, యేకాంబరం, బదరీనాథ్ పాల్గొన్నారు. పందిళ్లపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్‌లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చరిత్రను 6వ తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా చేర్చాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన లక్ష కార్డుల ఉద్యమాన్ని గురించి బత్తుల నీలిమ వివరించారు.

రాజ్యాంగంతో అందరికీ సమాన హక్కు..

చినగంజాం/కారంచేడు/మార్టూరు: ప్రతి ఒక్కరూ తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కారంచేడు మండలం కొడవలివారిపాలెం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏ ఉమామహేశ్వరరావు అన్నారు. పాఠశాల ప్రాంగణంలో రాజ్యాంగ అమలు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు భవనం శ్రీనివాసరెడ్డి, పావులూరి శ్రీనివాసరావు, కాంప్లెక్స్‌ల చైర్మన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

- మార్టూరు మండలం బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాచిన చలపతి మాట్లాడుతూ రాజ్యాంగం దేశ సమగ్రతను కాపాడుతుందని దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.
- పర్చూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్య రాజ్యాంగ అమలు దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బందితో కలిసి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రేమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- పర్చూరు రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకొని స్థానిక దళిత నాయకులు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. బొమ్మల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు వీ అబ్రహం, ఎన్ కిషోర్, గేరా స్వరాజ్ కుమార్, కే ఇస్సాక్, చింతా సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- యద్దనపూడి మండలం చింతపల్లిపాడు పాఠశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఎస్‌ఐ రత్నకుమారి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో షేక్ మహ్మద్ అఖిబ్ జావేద్, సిబ్బందిచే రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథం..

అద్దంకి రూరల్/జే.పంగులూరు/మేదరమెట్ల/బల్లికురవ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం భారతీయులకు ఒక పవిత్ర గ్రంథంలాంటిదని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశాలన్నింటిలో భారత రాజ్యాంగం పెద్ద రాజ్యాంగమన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

- దేశంలోని పౌరులందరికీ అన్ని విషయాల్లో సమన్యాయం అందివాలని కొరిశపాడు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం కొరిశపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితబహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ మెహతాజ్, రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, అంబేడ్కర్ దళిత సంఘాల అధ్యక్షుడు ఆంజనేయులు, జీ.రత్నకుమార్ పాల్గొన్నారు.
- పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ రామారావు ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రావూరి రమేష్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వీఆర్‌ఓ చెంపారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- రాజ్యాంగ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బల్లికురవ ఎస్సై జీవీ చౌదరి కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలైన ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు, గంజాయి డ్రగ్స్ మద్యానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు నాగినేని సాంబశివరావు, మక్కెన రామారావు, దమ్ము అంజయ్య, పరిటాల వెంకటరావు, షేక్ అబ్దుల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అంకం నాగరాజు, ఎంపీపీ యర్రమోతు రమేష్‌బాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, జ్యోతి చంద్రమౌళి, దేవపాలన, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న బల్లికురవ ఎస్సై



యద్దనపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ రత్నకుమారి



వేటపాలెంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న పట్టభద్రుల సంఘం నాయకులు



బొబ్బేపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పర్చూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



కొడవలివారిపాలెంలో పార్లమెంట్ ఆకారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



చీరాల: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు



చీరాల శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న పాఠకులు



అద్దంకిలో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న ఐక్య వేదిక సభ్యులు



పంగులూరు సచివాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్, తదితరులు



కొరిశపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు


శిథిలావస్థలో పశువైద్యశాల



శిథిలావస్థకు చేరిన పంగులూరు పశువైద్యశాల



విరిగిపోయిన ఇనుప కడ్డీలు



పెచ్చులూడిన స్లాబు

- దయ్యాల భవనాన్ని తలపిస్తున్న పంగులూరు పశువైద్యశాల
- వర్షాలకు తడుస్తున్న మందులు, పశువుల దాణ
- పట్టని అధికారులు, ప్రభుత్వం

జే.పంగులూరు: వ్యవసాయం రంగంలో పాడిపరిశ్రమకు ప్రత్యేక స్థానం ఉంది. పాడిపరిశ్రమతోనే చాలా మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. అటువంటి పాడిపరిశ్రమంలో పశువులకు అనారోగ్యం చేస్తే కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే. కాని అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా వాటిని రక్షించే పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. మండలంలోని పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థలోకి చేరుకుంది. పైకప్పు పెచ్చులు ఊడి ఎప్పుడు మీద పడుతాయోమోనని ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. తలుపులు పూర్తిగా పాడైపోయి వెక్కిరిస్తున్నాయి. 1977లో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగటయ్య సహకారంతో గ్రామస్తులు సొంత డబ్బులు వెచ్చించి పశువైద్యశాల కట్టించుకున్నారు. ఈ వైద్యశాల కట్టి ఇప్పటికి 47 ఏళ్లవుతోంది. కానీ ఇప్పటికి ప్రభుత్వం నుంచి వైద్యశాల నూతన భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు ఇవ్వలేదు. వైద్యశాల పరిధిలో మొత్తం 40 సెంట్ల స్థలం ఉంది. పశువులను బంధించి చికిత్స చేసే ఇనుప కడ్డీలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి.

తడుస్తున్న మందులు, దాణ..

వైద్యశాల భవనంలో పశువుల సంబంధించిన మందులు, వస్తు సామగ్రి వర్షాకాలంలో తడిచి పాడైపోతున్నాయి. కొన్ని పరికరాలు పనికిరాకుండా పోతున్నాయి. ప్రస్తుతం ఈ వైద్యశాలలో ఉండేందుకు సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే గ్రామస్తులు పలుమార్లు అధికారులకు నూతన పశు వైద్యశాల భవనం కోసం ఎన్ని సార్లు దరఖాస్తులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.



పూర్తిగా దెబ్బతిన్న తలుపులు

> **అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు..**
> వైద్యశాల నూతన నిర్మాణానికి ఇప్పటికి అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు పలుమార్లు వినతి పత్రం అందించాం. కానీ ఎవరూ స్పందించలేదు. 1977లో గ్రామ ప్రజల సొంత డబ్బులు వెచ్చించి వైద్యశాల నిర్మించారు. కూటమి ప్రభుత్వం చొరవచూపి నూతన భవనం నిర్మించాలి.
> – సుబ్బారావు, రైతు

> **స్లాబుపై నుంచి కారుతోంది..**
> ప్రస్తుతం వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో మందులు, పశుదాణ, పిట్టు వంటివి వైద్యశాలలో నిల్వ చేయడం కష్టంగా మారింది. స్లాబుపై నుంచి నీరు కారుతోంది. మందులు, దాణ భద్రంపరచటం కష్టంగా మారింది. సిబ్బంది కూడా వైద్యశాలలో ఉండి పనిచేయాలంటే ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నూతన భవనం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
> – మురళీకృష్ణ, పశు వైద్యాధికారి

చీరాల అభివృద్ధికి ప్రగడ కోటయ్య కృషి




ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కరణం వెంకటేష్

చీరాల: చీరాల ప్రాంత అభివృద్ధిలో ప్రగడ కోటయ్య తనదైన ముద్ర వేశారని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ప్రజాబంధు ప్రగడ కోటయ్య 29వ వర్ధంతి సందర్భంగా మంగళవారం చీరాలలోని కోటయ్య విగ్రహానికి వెంకటేష్, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఏర్పాటు అయిన తర్వాత తొలి ఎమ్మెల్యేగా ఎన్నికై వ్యవసాయ రంగానికి పంపింగ్ స్కీం, ఉపాధి కోసం స్పిన్నింగ్ మిల్లు, విద్యార్థుల కోసం కాలేజీ ఏర్పాటు చేసి చీరాల ప్రాంత అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారన్నారు. చేనేతలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, డాక్టర్ వరికూటి అమృతపాణి, ప్రజా బంధు ప్రగడ కోటయ్య యూత్ వాలంటరీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు దామర్ల శ్రీకృష్ణ, మాజీ సర్పంచ్ చుండూరి వాసు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పొలం తగాదా విషయమై కేసు

చినగంజాం: పొలం తగాదా విషయమై ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్సై శీలం రమేష్ వివరాల మేరకు.. నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన మల్లినీడి మహాలక్ష్మీ అనే మహిళకు చినగంజాం మండలం మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలో 1.59 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. ఆమె గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటుంది. ఆమె విదేశాల్లో ఉండటంతో ఆ భూమిని ఆమె తండ్రి కుర్రా శంకరరావు సాగు చేస్తుంటాడు. ఈ సీజన్‌లో అతడు ఆ భూమిలో అపరాలు సాగు చేపట్టాడు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన తరిగొప్పుల కృష్ణ ప్రసాద్ ఈనెల 25వ తేదీ సాయంత్రం ఆ భూమిలోనికి ట్రాక్టర్‌ను తీసుకొని వచ్చి పంటను దున్ని వేశాడు. ఈ విషయాన్ని ప్రశ్నించిన శంకరరావును బెదిరించాడు. దాంతో బాధితుడు శంకరరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టాడు.

ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్‌కు అభినందనలు



చీరాల రూరల్: ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్‌గా ఎంపికైన విద్యార్థిని పాఠశాల యాజమాన్య అభినందించింది. స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్లో 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న జయంతిపేటకు చెందిన కొమ్మతోటి సనా ఏంజల్ అనే విద్యార్థిని 23 (ఏ) ఆంధ్రా బెటాలియన్‌లో ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్‌గా ఎంపికయ్యింది. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని ఎన్‌సీసీ హెడ్‌క్వార్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉత్తమ కేడెట్ అవార్డును గ్రూప్ కమాండర్ చంద్రశేఖర్ చేతులు మీదుగా అందించినట్లు ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపినాథ్ తెలిపారు. ఉత్తమ కేడెట్‌గా ఎంపికైన సనా ఏంజల్‌ను మంగళవారం స్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ సిస్టర్ జీనా జేవియర్, కరస్పాండెంట్ సిస్టర్ ఎల్లా ట్రెసా, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపినాథ్, పీఈటీలు బోయిన ధనుంజయ, విజయనిర్మల, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.